
సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 9 । మే । 2025



ఉత్సాహంగా క్రికెట్ శిక్షణ శిబిరం 10లో



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో విస్తృత తనిఖీలు 8లో



స్టేడియం పనులు క్లీన్‌బౌల్డ్ 10లో

న్యూస్‌రీల్

కరెన్సీ నోట్ల అలంకరణలో చినపోలమాంబ



మద్దిలపాలెం : శివాజీపాలెం, పీతలవానిపాలెం గ్రామ దేవత చిన పోలమాంబ వార్షిక వేడుకల్లో భాగంగా నాల్గవ గురువారం నోట్ల అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సీనియారిటీ జాబితా విడుదల


విశాఖ విద్య : ఉత్తరాంధ్రలో ప్రభుత్వ యాజమాన్యాల పరిధి పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ల ఉద్యోగోన్నతులకు (గ్రేడ్-2 హెచ్‌ఎం) సంబంధించిన తుది సీనియారిటీ జాబితాను విడుదల చేసినట్లు ఆర్జేడీ బి.విజయభాస్కర్ తెలిపారు. వెబ్‌సైట్‌లో జాబితాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సీనియారిటీ జాబితాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 10వ తేదీలోగా మధురవాడలో గల ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు కార్యాలయంలో తగిన ధృవీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వాడపల్లికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు




దాబాగార్డెన్స్ : తూర్పుగోదావరి జిల్లా వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే భక్తుల కోసం ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతుందని జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు పేర్కొన్నారు. ప్రతి శనివారం ఉదయం 4 గంటలకు ద్వారకా బస్‌స్టేషన్ నుంచి బయలుదేరి వాడపల్లి చేరుకుంటుందని, భక్తుల ప్రదక్షిణలు, స్వామి దర్శనం అనంతరం సాయంత్రం 4 గంటలకు వాడపల్లిలో బయలుదేరి రాత్రి 9 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుందని చెప్పారు. ప్రయాణ చార్జీ(ఒక్కొక్కరికి) సూపర్ లగ్జరీ రూ.1000గా నిర్ణయించామని, టికెట్లు కావల్సిన వారు https://www.apsrtconline.in లో రిజర్వ్ చేసుకోవాలని కోరారు. వివరాలకు 9959225602, 9052227083, 9959225594, 9100109731 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

చర్లపల్లి-బ్రహ్మపూర్ స్పెషల్స్ పొడిగింపు




తాటిచెట్లపాలెం : ప్రయాణికుల సౌకర్యార్థం చర్లపల్లి-బ్రహ్మపూర్-చర్లపల్లి స్పెషల్ రైలు మరికొంత కాలం పొడిగిస్తున్నట్టు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. చర్లపల్లి -బ్రహ్మపూర్ (07027) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 9, 16, 23, 30 జూన్ 6, 13, 20, 27వ తేదీల్లో (శుక్రవారం) రాత్రి 8.15 గంటలకు చర్లపల్లిలో బయల్దేరి మరుసటిరోజు(శనివారం) ఉదయం 9.25 గంటలకు దువ్వాడకు, అదేరోజు మధ్యాహ్నం 2.15 గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బ్రహ్మపూర్-చర్లపల్లి (07028) స్పెషల్ ఈ నెల 10, 17, 24, 31, జూన్ 7, 14, 21, 28వ తేదీల్లో (శనివారం) సాయంత్రం 4.45 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 9.43 గంటలకు దువ్వాడకు, మరుసటిరోజు (ఆదివారం) ఉదయం 11.35 గంలకు చర్లపల్లి చేరుకుంటుంది.

ఈపీడీసీఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా సూర్యప్రకాష్ బాధ్యతలు



విశాఖ సిటీ: ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా టి.వి.సూర్యప్రకాష్ గురువారం సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. 1986లో ఏపీఎస్ఈబీ కేటీపీఎస్‌లో అసిస్టెంట్ ఇంజనీర్‌గా చేరిన ఆయన పలు విభాగాల్లో విధులు నిర్వర్తిస్తూ ఏపీఈపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ హోదాలో 2021లో పదవీ విరమణ పొందారు. ఆయన తాజాగా ఈపీడీసీఎల్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంతో పాటు రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అలాగే గ్రామీణ ప్రాంతాలకు 24/7 3-ఫేజ్ విద్యుత్‌ను అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సూర్యప్రకాష్‌ను సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి, డైరెక్టర్లు డి.చంద్రం, టి.వనజ అభినందించారు.

విశాఖపై నెత్తుటి ధారలు



నాలుగు నెలల్లో తొమ్మిది హత్యలు
వీరిలో ఏడుగురు మహిళలే..
సిటీ ఆఫ్ డెస్టినీ కాస్తా.. సిటీ ఆఫ్ క్రైమ్‌గా రూపాంతరం?
కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువు

విశాఖ సిటీ: ఒక్క రోజులో డెలివరీ కాబోయే భార్యను అత్యంత పాశవికంగా గొంతు నులిమి చంపేసిన భర్త.. వృద్ధ దంపతులను దారుణంగా హత్య చేసి డబ్బు, మంగళసూత్రాన్ని ఎత్తుకుపోయిన హంతకుడు.. పెళ్లికి అంగీకరించలేదని ప్రియురాలు, ఆమె తల్లి గొంతు కోసిన ప్రియుడు.. ఇలా వరుస హత్యలతో విశాఖలో రుధిర ధారలు పారుతున్నాయి. నగరంలో నెత్తుటి మరకలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. సిటీ ఆఫ్ డెస్టినీ.. ఇప్పుడు సిటీ ఆఫ్ క్రైమ్‌గా మారిపోయింది. ఇందుకు ఇటీవల వరుసగా జరుగుతున్న హత్యలే నిదర్శనం. ఈ ఏడాది నాలుగు నెలల్లోనే 9 హత్యలు చోటు చేసుకున్నాయి. ఇందులో ఏడుగురు మహిళలే బలవడం బాధాకరం. ప్రేమ.. పెళ్లి.. వివాహేతర సంబంధం.. డబ్బు.. ఇలా కారణమేదైనా అవి హత్యలకు దారితీస్తున్నాయి. ప్రశాంత విశాఖను ఉలిక్కిపడేలా చేస్తున్నాయి.

మహిళలకు రక్షణ కరువు

'మహిళలకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదు. ఆడ పిల్లల రక్షణపై వెనకడుగు వేసేది లేదు. మహిళల భద్రత తమ తొలి ప్రాధాన్యత' అని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ప్రగల్భాలు పలికారు. ఇవన్నీ ప్రచార ఆర్భాటాలకే తప్ప, మహిళలపై అకృత్యాలను అడ్డుకోలేకపోతున్నారు. విశాఖలో పట్టపగలే మహిళలపై దాడులకు తెగబడుతున్నారు. అకృత్యాలు జరుగుతున్నాయి. ఇటీవల జరిగిన వరుస ఘటనల్లో ఏడుగురు మహిళలే హత్యకు గురవడం కూటమి ప్రభుత్వంలో పరిస్థితికి అద్దం పడుతోంది. బాలికలు, మహిళలపై దాడులు, అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయి. నగరంలో వరుస హత్యలు జరుగుతున్నా ప్రభుత్వం చోద్యం చూస్తోంది తప్ప.. వాటిని అరికట్టే చర్యలకు ఉపక్రమించడం లేదు. దీంతో కూటమి ప్రభుత్వంలో విశాఖ ఆర్థిక రాజధానిగా కాకుండా నేర రాజధానిగా మారుతోందన్న భావన కలుగుతోంది.

వరుస హత్యలతో కలవరం

విశాఖకు ప్రశాంత నగరంగా పేరుంది. దేశంలో ఎక్కడ ఉద్యోగం, వ్యాపారం చేసినా.. చివరకు విశాఖలో స్థిరపడాలని కోరుకుంటారు. అలాంటి నగరంలో వరుస హత్యలు కలవరానికి గురిచేస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా జరుగుతున్న ఘటనలతో విశాఖ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పెదగదిలిలో ఐదు నెలల కుమార్తెను కన్న తల్లే హత్య చేసింది. అలాగే పెళ్లికి అంగీకరించలేదని ప్రియురాలిని.. ఆన్‌లైన్ గేమ్స్ ఆడొద్దని వారించిన తల్లిని.. పూజల పేరుతో వివాహితపై అసభ్యకరంగా ప్రవర్తించిన జ్యోతిష్యుడిని.. వివాహేతర సంబంధాన్ని వదిలించుకోవాలని ప్రియురాలిని.. ఇలా అనేక కారణాలతో విశాఖలో హత్యలు చోటుచేసుకున్నాయి.

ఈ ఏడాదిలో వరుస ఘటనలు

- మే 2న దాకమర్రి ఫార్చ్యూన్ లేఅవుట్‌లో మహిళను హత్య చేసి పెట్రోల్ పోసి తగలబెట్టిన ప్రియుడు.
- ఏప్రిల్ 26న దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాజీవ్‌నగర్‌కు చెందిన దంపతులు యోగేంద్రబాబు(65) లక్ష్మి(52)లను డబ్బు కోసం హత్య చేసిన దుండగుడు.
- ఏప్రిల్ 14న మధురవాడలో నిండు గర్భిణి అనూషను హత్య చేసిన భర్త జ్ఞానేశ్వర్. 24 గంటల్లో డెలివరీ అవ్వాల్సి ఉండగా చంపడంతో ఆమె గర్భంలో ఉన్న ఆడ శిశువు కూడా కన్నుమూసింది.
- ఏప్రిల్ 2న కొమ్మాదిలోని వికలాంగుల కాలనీలో ప్రియురాలు, ఆమె తల్లి గొంతు కోసిన ప్రియుడు. తల్లి అక్కడికక్కడే మృతి చెందింది.
- ఫిబ్రవరి 21న పూజల పేరుతో మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన జ్యోతిష్యుడు అప్పన్నను ఆమె భర్త చిన్నారావు బోయపాలెం-కాపులుప్పాడ మార్గంలో కల్లివానిపాలెం గ్రామంలో నిర్మానుష్య ప్రాంతంలో కత్తితో పొడిచి హత్య చేశాడు. మరుసటి రోజు వచ్చి పెట్రోల్ పోసి తగలబెట్టాడు.
- జనవరి 1న మల్కాపురంలో ఆన్‌లైన్ గేమ్స్ ఆడొద్దని వారించిన తల్లిని కొట్టి చంపిన కుమారుడు.

అంధమైన బంధంలోకి..



స్పందించే హృదయముంటే.. చూపుతో పనేముంది? కన్నులు లేకున్నా ప్రేమ వెలుగే జీవితానికి దారి చూపుతుందంటూ వివాహబంధంతో ఒకటవుతున్నారు ఆ జంట. కేంద్రప్రభుత్వ ఉద్యోగి రాఘవేంద్ర తనలాగే కంటి చూపులేని తన నెచ్చెలినే జీవిత భాగస్వామిగా ఎన్నుకున్నాడు. విధి వంచించినా.. ప్రేమ సమాజం పంచిన ప్రేమతో వెలిగింది శివజ్యోతి. ఇద్దరూ అక్షరాల ఆసరాగా ఎదిగారు. ఒకరికొకరు తోడుగా నిలవాలని కోరుకున్నారు. చీకటి కన్నుల్లో మెరిసిన ఆ వెలుగు రేఖలు భవిష్యత్తుకు బంగారు బాటలు చూపగా.. తమ కలలను సాకారం చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది ఆ జంట. ఈ నెల 11న వారి కల సాకారం కానుంది. ప్రేమబంధం ఏడు అడుగులతో పవిత్రబంధంగా మారనుంది. – దాబాగార్డెన్స్

- ఒక్కటవుతున్న అంధులు
- అనంతపురం అబ్బాయితో విశాఖ అమ్మాయికి వివాహం
- 11న ప్రేమసమాజం వేదికగా కల్యాణం

ప్రేమ సమాజం ముంగిట పెళ్లి సందడి నెలకొంది. ప్రేమ సమాజం కంచర్ల అన్నపూర్ణాదేవి వేదికగా, ప్రేమ సమాజం ఆశ్రిత శివజ్యోతి, అనంతపురం జిల్లా బుక్కపట్నం గ్రామానికి చెందిన ఎనుముల గంగన్న, నారాయణమ్మల కనిష్ట పుత్రుడు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి రాఘవేంద్రల వివాహానికి సర్వం సిద్ధమైంది. వేద మంత్రాలు, పచ్చని తోరణాలు, బాజా భజంత్రీలు, మంగళ వాయిద్యాల నడుమ, దాతల దీవెనలతో ఈ వేడుక కన్నుల పండుగగా జరగనుంది. విందు భోజనాలతో ప్రేమ సమాజం కళకళలాడనుం డగా, పెద్దల ఆశీస్సులతో ఈ అంధుల జంట ఒక్కటి కానుంది. గత నెల 11న పెద్దలు ఈ పెళ్లి తంతుకు శ్రీకారం చుట్టారు. ఇరువురూ అంధులే కావడం విశేషం. చూపులేని యువకుడు, తనలాంటి తోడు కోసం ఎదురుచూసి, ఆ కలను నిజం చేసుకుంటున్న శుభ తరుణమిది. ఈ అరుదైన వివాహం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతు న్నాయి. వివరాల్లోకి వెళితే, జన్మతః అంధుడైన ఎనుమోలు రాఘవేంద్ర బీకాం కంప్యూటర్స్ పూర్తి చేసి, ప్రస్తుతం కోయింబత్తూర్ పీఎఫ్ కార్యాలయంలో ఉద్యోగం చేస్తున్నారు. రాఘవేంద్ర తల్లిదండ్రులది అనంతపురం జిల్లా బుక్కపట్నం మండలం సిద్దరాంపురం. వ్యవసాయ నేపథ్యం కలిగిన వారి కుటుంబంలో రాఘవేంద్ర తనలాంటి కంటి చూపులేని అమ్మాయినే వివాహం చేసుకోవాలని కోరుకున్నాడు. ఆయన కోరిక మేరకు, రాఘవేంద్ర సోదరుడు రమణ కొందరు అందించిన సమాచారం ద్వారా విశాఖలోని ప్రేమ సమాజం ప్రతినిధులను సంప్రదించారు. దీంతో ఈ వివాహానికి మార్గం సుగమమైంది.

ప్రేమసమాజమే తల్లిగా..

మరోవైపు, శివజ్యోతి పుట్టుకతోనే కంటి చూపును, తల్లిదండ్రులను కూడా కోల్పోయింది. నగరంలోని వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ సిఫార్సుతో ఆమెకు ప్రేమ సమాజం ఆశ్రయం కల్పించింది. చినజీయర్ స్వామి అంధుల పాఠశాలలో ఇంటర్మీడియట్, నగరంలోని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఏ పూర్తి చేసింది. ఇరువురి అంగీకారంతో, ప్రేమ సమాజం వేదికగా గత నెలలో తాంబూలాలు మార్చుకున్నారు. ఈ నెల 11న వివాహ ముహూర్తం ఖరారైంది. ప్రేమ సమాజం అధ్యక్షుడు బుద్ధ శివాజీ, కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో శివజ్యోతి తరపున పెద్దలుగా వ్యవహరిస్తున్నారు.

రేపు పెళ్లి రాట

ప్రేమ సమాజం ప్రాంగణంలో శనివారం పెళ్లి రాట కార్యక్రమం జరగనుండగా, శివజ్యోతిని పెళ్లి కుమార్తెగా ముస్తాబు చేయనున్నారు. మే 11న రాత్రి 7.05 గంటలకు స్వాతి నక్షత్రయుక్త వృశ్చిక లగ్నంలో రాఘవేంద్ర, శివజ్యోతిలు ఒక్కటి కానున్నారు. ఈ శుభ సందర్భానికి విచ్చేసిన అతిథులు, వధూవరుల కుటుంబ సభ్యుల కోసం ప్రత్యేక విందు భోజనం ఏర్పాటు చేశారు. ప్రేమ సమాజం వేదికగా జరుగుతున్న ఈ అపురూపమైన వేడుక అందరినీ ఆనందంలో ముంచెత్తుతోంది.



తాంబూలాలు పుచ్చుకున్న ఇరు కుటుంబాలు

సింహాచలం ఈవోని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు

సింహాచలం : చందనోత్సవం నాడు సింహగిరిపై గోడ కూలి ఏడుగురు భక్తులు దుర్మరణం పాలైన ఘటనలో దేవస్థానం ఈవో కె.సుబ్బారావును సస్పెండ్ చేస్తూ రెవెన్యూ(విజిలెన్స్) డిపార్ట్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.జయలక్ష్మి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఎలాంటి పర్మిషన్ లేకుండా హెడ్ క్వార్టర్స్ దాటి వెళ్లరాదని పేర్కొన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిషన్ ఇచ్చిన ప్రాథమిక నివేదిక ఆధారంగా దేవస్థానం ఈవోతో పాటు ఈఈ డీజీ శ్రీనివాసరాజు, డిప్యూటీ ఈఈ కేఎస్ఎన్ మూర్తి, జేఈ కె.బాబ్జీతో పాటు ఏపీటీడీసీకి చెందిన ఈఈ కె.రమణ, డిప్యూటీ ఈఈ ఏబీవీఎల్ఆర్ స్వామి, ఏఈ పి.మదన్‌మోహన్‌లను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. మిగతా ఆరుగురి సస్పెన్షన్ ఆర్డర్లు గురువారం సాయంత్రానికి వచ్చినట్లు చెబుతున్నా.. ఇంకా అధికారికంగా ప్రకటించలేదు.

రోడ్డు ప్రమాద బాధితులకు పరిహారం అందజేత

అల్లిపురం : రోడ్డు ప్రమాద బాధితుల సహాయ కేంద్రం ద్వారా రూ.లక్ష అందజేసినట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. ఇటీవల హిట్ అండ్ రన్ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన ఆలమూరు రామకృష్ణారావు, వాడపల్లి సావిత్రమ్మలకు గురువారం రూ.50 వేలు చొప్పున పరిహారం వారి బ్యాంకు ఖాతాలో జమచేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు జీవ కౌన్సిల్ ద్వారా 45 మందికి రూ.36 లక్షలు పరిహారం అందజేసినట్లు తెలిపారు. హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులు 7995095793 నెంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

గళమెత్తిన కలం

- సాక్షి ఎడిటర్ ఇంట్లో దాడులపై జర్నలిస్టు సంఘాల నిరసన
- కలెక్టరేట్ వద్ద జర్నలిస్టుల ప్రదర్శన
- కూటమి సర్కార్ తీరును ఎండగట్టిన జర్నలిస్టు నేతలు



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పలు జర్నలిస్టుల సంఘాల నాయకులు, జర్నలిస్టులు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

మహారాణిపేట : ఎలాంటి అనుమతులు, సమాచారం లేకుండా సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డి నివాసంలో పోలీసులు అక్రమంగా ప్రవేశించి సోదాలు చేయడంపై పలు జర్నలిస్టు సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ అక్రమాలు, అవినీతిని సాక్షి వెలుగులోకి తెస్తుండడంతో కూటమి నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని, అందుకే పోలీసులతో భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని పలువురు జర్నలిస్టు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

కలెక్టర్‌కు వినతి పత్రం

సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంట్లో అక్రమంగా సోదాలు చేయడాన్ని నిరసిస్తూ పలు జర్నలిస్టు సంఘాల నేతలు గురువారం కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పోతుమహంతి నారాయణ్, బ్రాడ్‌కాస్టింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఇరోతి ఈశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ రాష్ట్ర నాయకుడు ఆర్.రామచంద్రరావు తదితరులు ఉన్నారు.

నిరసన ప్రదర్శన

అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపిన జర్నలిస్టు సంఘాల నేతలు కూటమి ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా, జర్నలిస్టులపై దాడులను నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సాక్షి విశాఖ బ్యూరో ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ ఈ రోజును పత్రికా రంగంలో బ్లాక్ డేగా పరిగణిస్తున్నామన్నారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాల డెస్క్ ఇన్‌చార్జి బి.బి.సాగర్ మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులు సరికావని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీ పక్కి వేణుగోపాల్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అవినీతి, అక్రమాలను వెలికితీస్తున్న సాక్షిపై కక్ష సాధింపు చర్యలు మంచిది కాదని పేర్కొన్నారు. విశాఖ ఎడిషన్ ఇన్‌చార్జి కె.రామకృష్ణ మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉద్దేశపూర్వకంగానే కూటమి దాడులు



సాక్షి ఎడిటర్ ఇంట్లో పోలీసులు ప్రవేశించి సోదాలు చేయడం హేయమైన చర్య. కూటమి ప్రభుత్వం ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటం దారుణం. ప్రజాస్వామ్యంలో ఇటువంటి చర్యలు ఎంత మాత్రం సరికావు. ప్రభుత్వ తీరు అవమానకరంగా ఉంది. కూటమి సర్కారు ఉద్దేశపూర్వకంగా ఇలాంటి దాడులు చేయడం తగదు. భవిష్యత్తులో ఇలాంటి దాడులు కొనసాగిస్తే ఆందోళనను ఉధృతం చేస్తాం.

– ఆర్.రామచంద్రరావు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు



పత్రికా రంగంలో ఈ రోజును బ్లాక్ డేగా పరిగణిస్తున్నాం. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ప్రభుత్వ అవినీతి, అక్రమాలను సాక్షి వెలుగులోకి తేవడంతోనే కక్ష సాధిస్తోంది. పోలీసులతో జర్నలిస్టులను భయపెట్టే ధోరణిని విరమించుకోవాలి. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. ప్రభుత్వ తీరును జర్నలిస్టులంతా ముక్తకంఠంతో ఖండించాలి.

– పి.నారాయణ్, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు

ఐక్యంగా ఉద్యమిస్తాం



ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా ఒక పత్రిక ఎడిటర్ ఇంటికి పోలీసులు వెళ్లడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇలాంటి సంఘటనల ద్వారా జర్నలిస్టులను భయపెట్టాలని చూడటం సరికాదు. కూటమి సర్కార్ ఉద్దేశపూర్వకంగా జర్నలిస్టులను బెదిరించే ప్రయత్నం చేస్తోంది. ప్రజాస్వామ్యంలో కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం తగదు. ఇలాంటి చర్యలను నిలిపివేయకపోతే జర్నలిస్టులంతా ఐక్యంగా ఉద్యమిస్తాం.

– గంట్ల శ్రీనుబాబు, జర్నలిస్టుల సంఘం జాతీయ కార్యదర్శి

కమనీయం వెంకన్న కల్యాణం

గోవిందనామస్మరణతో మార్మోగిన బల్లిగిరి



వేడుకలో పాల్గొన్న భక్తులు



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

అల్లిపురం: వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా బల్లిగిరిలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవం గురువారం కన్నుల పండుగగా జరిగింది. పెళ్లి కుమార్తెలుగా ముస్తాబైన శ్రీదేవి, భూదేవిల నడుమ ముగ్ధ మనోహర రూపంలో వెలుగొందుతున్న శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకను తిలకించిన భక్తులు గోవిందనామ స్మరణతో పులకించిపోయారు. కల్యాణోత్సవాల్లో భాగంగా ఉదయం అంకురార్పణ, గరుడ పతాకాన్ని ధ్వజస్తంభంపై ఎగురవేయ డం, విశేష హోమాలు ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారి తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారి తిరువీధి ఉత్సవం కన్నుల విందుగా సాగింది. దేవదాయ ధర్మాదాయ శాఖ తరపున ఆలయ కార్యనిర్వహణాధికారిణి జీవీ రమాబాయి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు గొడవర్తి రఘునాథశర్మ పర్యవేక్షణలో ఆగమ పండితులు స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. అధిక సంఖ్యలో జంటలు ఈ కళ్యాణోత్స వంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం దేవస్థానం వారు కల్యాణ దంపతులకు వేద పండితుల ఆశీర్వచనాలు, గౌరవ సత్కారాలు అందజేసి, స్వామివారి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

రక్తదానం చేసి స్ఫూర్తి నింపిన కలెక్టర్



రక్తదానం చేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, డీఆర్‌వో భవానీ శంకర్

మహారాణిపేట: జిల్లా యంత్రాంగం, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని పురస్కరిం చుకొని కలెక్టరేట్ పరిధిలోని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ భవనంలో, జిల్లా పరిషత్ కూడలిలోని ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకులో వేర్వేరుగా శిబిరాలు ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ రక్తదానం ఆవశ్యకతను తెలుపుతూ పిలుపునివ్వడంతో, జిల్లాలోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. కలెక్టరేట్ శిబిరంలో 143 మంది, రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకులో ఆరుగురు మొత్తం 149 మంది దాతలు రక్తదానం చేశారు. కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్‌తో కలిసి రక్తదానం చేసి అందరికీ స్ఫూర్తినిచ్చారు. రెడ్ క్రాస్ ప్రతినిధులు, ఆది లీల ఫౌండేషన్, కలెక్టరేట్ అధికారులతో కలిసి కలెక్టర్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ రవికుమార్, పీఆర్వో రావు, ఆది లీల ఫౌండేషన్ ప్రతినిధి ఆదినారాయణ రాజు, కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు, ఇతర అధికారులు, ఉద్యోగులు, వైద్యాధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి పూర్తి సహకారం

శాప్ చైర్మన్ రవి నాయుడు



మాట్లాడుతున్న ఏపీ శాప్ చైర్మన్ రవి నాయుడు. చిత్రంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తదితరులు

మహారాణిపేట: విశాఖలో క్రీడల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని శాప్ చైర్మన్ రవి నాయుడు తెలిపారు. క్రీడల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం, క్రీడా సంఘాల సమన్వయం ముఖ్యమన్నారు. వేసవి శిబిరాలు, క్రీడాభివృద్ధిపై కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యే గణబాబు, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథ్‌లతో ఆయన సమావేశమయ్యారు. విశాఖను క్రీడా కేంద్రంగా మలిచేందుకు సీఎం కృతనిశ్చయంతో ఉన్నారని ఆయన చెప్పారు. పాఠశాల స్థాయి నుంచే క్రీడలను ప్రోత్సహించాలని, ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ. 30 వేలు, ప్రాథమిక పాఠశాలలకు రూ. 17 వేలు క్రీడా సామాగ్రికి ప్రభుత్వం మంజూరు చేస్తోందన్నారు. 'పి 4' విధానంతో ప్రతిభావంతులైన క్రీడాకారులను దత్తత తీసుకుంటామని, ఉపాధి హామీ ద్వారా పాఠశాల మైదానాల అభివృద్ధికి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ వేసవిలో శాప్ ద్వారా 50 వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందే క్రీడాకారులను అరికట్టాలని కోరారు. క్రీడా అకాడమీల ఏర్పాటుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. జిల్లాలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. బక్కన్నపాలెంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం రూ. 200 కోట్లతో అత్యాధునిక స్టేడియం నిర్మాణం త్వరలో ప్రారంభమవుతుందని ఆయన ప్రకటించారు. కొమ్మాదిలో స్టేడియం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని, అన్ని స్టేడియంలను క్రీడాకారులకు అందుబాటులోకి తెస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో జూలియట్, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్టేడియం పనులు క్లీన్‌బౌల్డ్

- రూ.40 కోట్ల మరమ్మతుల్లో డొల్లతనం
- నేమ్ బోర్డ్ వేలాడుతున్న వైనం
- ఏసీఏ మహా నిర్లక్ష్యం



విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) పెద్దలు ఇటీవల విశాఖ క్రికెట్ స్టేడియంలో సుమారు రూ. 40 కోట్లు వెచ్చించి చేపట్టిన మరమ్మతుల నాణ్యతలో డొల్లతనం మరోసారి బయటపడింది. స్టేడియం ప్రవేశ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన నేమ్ ప్లేట్ సగానికి పైగా ఊడి వేలాడుతూ కనిపించిన దృశ్యాలు పనుల్లో నాసిరకాన్ని బహిర్గతం చేస్తున్నాయి. ప్రపంచ క్రీడా పటంలో ప్రత్యేక గుర్తింపు పొందిన వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ స్టేడియం పరువును ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ మరోసారి దిగజార్చింది. ప్రస్తుత ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ చేసిన నాసిరకం మరమ్మతులు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ప్రధాన ద్వారంపై కొత్తగా ఏర్పాటు చేసిన నేమ్‌బోర్డు ఊడిన తీరే అందుకు ప్రధాన నిదర్శనం.

అంతర్జాతీయ స్టేడియంపై నిర్లక్ష్యం

అంతర్జాతీయ ఫార్మెట్‌లో టెస్ట్, వన్డే, టీ20 మ్యాచ్‌లు ఒకే ఏడాదిలో నిర్వహించి చరిత్ర సృష్టించి ప్రపంచ క్రీడా పటంలో తనదైన ముద్ర వేసింది డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం. ఈ స్టేడియం నిర్మాణం పూర్తయిన ఆరేళ్లలో కేవలం రెండే వన్డే మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వగలిగింది. కానీ బీసీసీఐ అధ్యక్షుడిగా జగన్మోహన్ దాల్మియా ఉండగా, అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్సార్ దూరదృష్టితో వేసిన అడుగు ఒక్కసారిగా స్టేడియంలో అంతర్జాతీయ మ్యాచ్‌లే కాకుండా ఐపీఎల్ మ్యాచ్‌లకు హోమ్ గ్రౌండ్‌గా నిలబెట్టింది. ఆతిథ్య జట్టుకు అచ్చివచ్చిన స్టేడియంగా మారిపోయింది. అలాంటి స్టేడియం నేటి ఆంధ్ర క్రికెట్ సంఘం అపెక్స్ కౌన్సిల్ చర్యలతో డొల్లతనం బయటపడుతోంది. గత కార్యవర్గం నిర్మించిన పైలాన్‌కు రంగులు వేసి బీసీసీఐ కార్యదర్శి జై షా, మంత్రి లోకేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. బీసీసీఐ కార్యదర్శి వస్తానని చెప్పి రాకపోవడంతో పక్కన పెట్టిన దానికి ప్రస్తుత ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ హడావుడి చేసింది. ఐపీఎల్ మ్యాచ్‌లు ఇక్కడ ఆడటానికి ఢిల్లీ క్యాపిటల్స్ వసతులు బాగోలేవని చెప్పి సొమ్ము చేసుకునేందుకు తెరలేపారు. అన్ని హంగులతో ఉన్న స్టేడియానికి మరమ్మతులంటూ రూ. 40 కోట్లు వెచ్చించి గొప్పలు చెప్పుకుని చేసింది ఏమిటనేది తేటతెల్లమవుతోంది.

కేశినేని గొప్పలు

విశాఖకు ఆర్థిక రాజధాని, క్రీడా హబ్‌గా ఎదగడానికి విశాఖ స్టేడియమే కారణమని.. కార్యవర్గం అప్పట్లో ప్రెస్‌మీట్ పెట్టి మరీ పేర్కొంది. 600–800 మంది సిబ్బందితో రూపురేఖలు మార్చేసామంటూ చెప్పుకొచ్చారు. జనవరి 20 నుంచి నెలరోజుల వ్యవధిలోనే అన్ని హంగులు సమకూర్చేసామన్నారు. కార్పొరేట్లు నడవక్కర్లేకుండా లిఫ్ట్‌ల్లోనే వారికి సదుపాయం కల్పించేశామన్నారు. ఆంధ్రలో అహ్మదాబాద్‌ను తలదన్నే స్టేడియం నిర్మాణం గురించి మాట్లాడుతూ ఎవరూ కట్టలేరంటూ సంఘం అధ్యక్షుడు కేశినేని శివనాథ్ ఊదరగొట్టారు. అమరావతి స్పోర్ట్స్ విలేజ్‌లో స్టేడియం కట్టడానికి అడిగారని, అదీ ప్రాథమిక దశలోనే ఉందంటూ, ఇంకా సైట్ అలాట్ చేయలేదని పేర్కొన్నారు. మంగళగిరి స్టేడియం స్టాండ్స్ తుప్పు పట్టేయడంతో కొన్నింటిని తొలగించాల్సి వచ్చిందని, నేడు అక్కడ రంజీ మ్యాచ్‌లకు, శిక్షణకు తప్ప పనికిరాదని సెలవిచ్చారు. ఏనాటికైనా టెస్ట్ హోదా ఉన్న వైఎస్సార్ స్టేడియమే దిక్కు అంటూనే ఇలా నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడం ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. పనిలో పనిగా స్టేడియం ఇంత ఖ్యాతి నార్జించడానికి కృషి చేసిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరును తొలగించి అభాసుపాలయ్యారు.

వీఐపీల రక్షణలో సమయస్ఫూర్తితో మెలగాలి



శిక్షణ పొందిన పీఎస్‌వోలనుద్దేశించి మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

అల్లిపురం: పీఎస్‌వో (గన్ మెన్) విధులు నిర్వహించడం చాలా క్లిష్టతరమని, వీఐపీలను నూటికి నూరు శాతం రక్షించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. పీఎస్‌ఓలకు శారీరక సామర్థ్యంతో పాటుగా సమయస్ఫూర్తి కలిగి వుండాలని ఆయన సూచించారు. రెండు రోజులుగా పోలీస్ బ్యారెక్స్ సిటీ ట్రైనింగ్ సెంటర్‌లో జరుగుతున్న పీఎస్‌వోల క్యాప్సూల్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన పీఎస్‌వోలను ఉద్దేశించి సీపీ మాట్లాడుతూ, నిత్యం వీఐపీల భద్రతలో ఉండే పీఎస్‌ఓలు వారి భద్రత విషయంలో అన్ని కోణాల్లో అంచనా వేస్తూ రక్షణ కల్పించాలన్నారు. రెండు రోజుల శిక్షణలో నేర్చుకున్న అంశాలను సద్వినియోగం చేసుకుని విధులు నిర్వహించాలని ఆయన సూచించారు. వారికి శిక్షణ ఇచ్చిన రాష్ట్ర ఇంటిలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పీఎస్‌ఓ విధులు నిర్వహించడానికి అవసరమైన పీపీటీ రోడ్ షోలు, పబ్లిక్ మీటింగ్‌లు, రాత్రి వేళల్లో భద్రత, రోడ్డు ప్రయాణాలు, రైలు ప్రయాణాలు, విమాన ప్రయాణాలు, నీటి ప్రయాణాల్లో తీసుకోవాల్సిన భద్రతా ఏర్పాట్లు, బాంబు డిటెక్షన్, డిస్పోజింగ్, ఆహార భద్రత, ఎఫ్ఐబీ (ఫస్ట్ ఇన్ఫర్మేషన్ బ్రీఫింగ్), డ్రోన్ల నిఘా, ప్రథమ చికిత్స, అత్యవసర సమయాల్లో వీఐపీ భద్రత వంటి అంశాలపై శిక్షణ అందించారు.

వయసు పైబడినా తరగని విద్యా తృష్ణ

- సంస్కృతంలో సత్తా చాటిన వైద్యుడు
- 71 ఏళ్ల వయసులో విద్యార్జనపై దృష్టి



డాక్టర్ జ్ఞానానంద

మహారాణిపేట: రిటైర్డ్ మెడికల్ ఆఫీసర్ అయిన డాక్టర్ బి. జ్ఞానానంద (71) తన పట్టుదలతో వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమే అని నిరూపించారు. వైద్యుడిగా సేవలందిస్తూనే చదువుపై ఆసక్తి పెంచుకున్న ఆయన, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన సంస్కృత భారతి రెండేళ్ల కోర్సు ప్రవేశ పరీక్షలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. శ్రీకాకుళం జిల్లా కవిటి గ్రామానికి చెందిన బందరు మోహనాంగరావు కుమారుడైన డాక్టర్ జ్ఞానానంద విశాఖలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేసి, ఎన్ఏడీ, గాజువాక ప్రాంతాల్లో హోమియో వైద్య నిపుణుడిగా ప్రాక్టీస్ చేశారు. పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించడమే కాకుండా, విశాఖలోని హోమియో వైద్య విద్యార్థులకు శిక్షణ కూడా ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ జ్ఞానానంద మాట్లాడుతూ, చదువుకు వయసుతో సంబంధం లేదని, ఆసక్తి ఉంటే పరీక్షల్లో విజయం సాధించడం సులభమేనని అన్నారు. ప్రస్తుతం విజయనగరం, హైదరాబాద్, కవిటిలో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

భర్త వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

తాటిచెట్లపాలెం: భర్త వేధింపులు భరించలేక తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని తండ్రి లుకలపు తిరుపతిరావు ద్వారకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, శ్రీకాకుళం జిల్లా టెక్కలికి చెందిన శ్రావణిని బి. మాధవరావుకు ఇచ్చి వివాహం చేశారు. అనంతరం శ్రావణి కోరిక మేరకు ఆమెను విశాఖలోని ఓ డిగ్రీ కళాశాలలో చదివించారు. ఈ సమయంలో శ్రావణికి కొమర రోహిత్‌కుమార్‌తో స్నేహం ఏర్పడి, అది సన్నిహిత సంబంధానికి దారితీసింది. దీంతో ఇరువైపుల పెద్దల సమక్షంలో మాధవరావుతో విడాకులు తీసుకున్న శ్రావణి, ఆ తర్వాత రోహిత్‌కుమార్‌ను రిజిస్ట్రార్ కార్యాలయంలో రెండో వివాహం చేసుకుంది. వివాహం తర్వాత రోహిత్‌కుమార్ ప్రవర్తనలో మార్పు రావడంతో శ్రావణిని వేధించడం ప్రారంభించాడని ఆమె తండ్రి తిరుపతిరావు ఆరోపించారు. రోహిత్‌కుమార్ భార్యను పోషించలేక ఆమె సంపాదించి తీసుకురావాలని ఒత్తిడి చేసేవాడని, సొంత ఖర్చులు కూడా ఆమెనే భరించాలని వేధించేవాడని ఆయన తెలిపారు. రోహిత్‌కుమార్ విశాఖ–హైదరాబాద్ తిరుగుతుండేవాడని, విశాఖ వచ్చినప్పుడల్లా వేధించేవాడని పేర్కొన్నారు. పెళ్లయిన తర్వాత తనకు మనశ్శాంతి లేదని, చనిపోతే సంతోషంగా ఉంటానని రోహిత్ కుమార్ పదే పదే అనడంతో శ్రావణి తీవ్ర మానసిక ఆందోళనకు గురైంది. ఈ నెల 5న శ్రావణి ఆత్మహత్య చేసుకునేందుకు రైల్వే స్టేషన్‌కు వెళ్లగా, పోలీసులు గుర్తించి ఆమె సోదరుడికి సమాచారం అందించారు. అనంతరం రోహిత్‌కుమార్ ఆమెను హాస్టల్‌లో వదిలి వెళ్లిపోయాడు. బుధవారం మధ్యాహ్నం శ్రావణి మత్తు మాత్రలు మింగి ప్రాణాపాయ స్థితికి చేరుకుంది. చికిత్స పొందుతూ సాయంత్రం 4.30 గంటలకు మృతి చెందింది. తన కుమార్తెకు మృతికి కారణమైన రోహిత్‌కుమార్ చర్యలు తీసుకోవాలని శ్రావణి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

22 మంది జూదరుల అరెస్ట్

నరవలో పట్టుబడినవారు కూటమి ప్రభుత్వ కీలక నేత అనుచరులు

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని జీవీఎంసీ 88వ వార్డు నరవ, పెందుర్తి మండలం ఎస్ఆర్ పురం ప్రాంతాల్లో జూదమాడుతున్న 22 మందిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం రాత్రి పట్టుకున్నారు. పశ్చిమ నియోజకవర్గం గోపాలపట్నం ప్రాంతానికి చెందిన 10 మంది నాణేలు ఎగురవేసే ఆట ఆడుతున్నట్లు నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. దీనిపై వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు నరవ ప్రాంతంలో జూదమాడుతున్న వీరిని పట్టుకున్నారు. వీరిలో చాలా మంది కూటమిలోని ప్రధాన పార్టీకి చెందిన అసెంబ్లీలో ఓ కీలక ప్రజాప్రతినిధి అనుచరులు ఉన్నట్లు తెలుస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల తరువాత వీళ్లు జూదంలో నరవ ప్రాంతంలోనే గతంలో పోలీసులకు పట్టుబడ్డారు. తాజాగా మళ్లీ వారే అదే నాణేల జూదంలో పోలీసులకు చిక్కడం గమనార్హం. కాగా పెందుర్తి మండలం ఎస్ఆర్ పురంలో 12 మంది పేకాట ఆడుతూ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబడ్డారు. మొత్తం 22 మంది నిందితులను పెందుర్తి పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు సమాచారం.

ఓషన్ వ్యూ.. ఓ జ్ఞాపకం



అప్పట్లో నిర్మించిన ఓషన్ వ్యూ బంగ్లా (ఫైల్)



కూల్చివేయడంతో ఖాళీగా ఉన్న బంగ్లా ఉన్న ప్రదేశం

భీమునిపట్నం: భీమిలిలో ఓషన్ వ్యూ బంగ్లాగా పేరుగాంచిన చారిత్రాత్మక భవనం నేలమట్టం కావడంతో, ఈ అరుదైన కట్టడాన్ని చూసే అవకాశం ఎవరికీ లేదు. బ్రిటిష్ పాలనలో భీమిలి కొండవాలు ప్రాంతంలో రోడ్డు పక్కన ఇంపీరియల్ బ్యాంకుగా ఇది నిర్మితమైంది. అప్పట్లో ఇక్కడ పోర్టు ఉండడం వల్ల వాణిజ్య లావాదేవీల కోసం ఈ బ్యాంకును ఏర్పాటు చేశారు. అందుకే ఈ ప్రాంతానికి బ్యాంక్ రోడ్డు అనే పేరు వచ్చింది. స్వాతంత్ర్యం అనంతరం, చిట్టివలస జూట్‌మిల్లు యాజమాన్యం ఈ భవనాన్ని ప్రభుత్వం నుంచి కొనుగోలు చేసి విశాలమైన బంగ్లాగా మార్చింది. ఎత్తైన ప్రదేశంలో ఉండటంతో ఇక్కడి నుంచి సముద్ర దృశ్యం అద్భుతంగా కనిపించేది. దీంతో ఈ బంగ్లాకు 'ఓషన్ వ్యూ బంగ్లా' అనే పేరు స్థిరపడింది. ఇది జూట్‌మిల్లు గెస్ట్‌హౌస్‌గా ఉపయోగపడేది. జూట్‌మిల్లు యజమానులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు వంటి ప్రముఖులు భీమిలి వచ్చినప్పుడు ఇక్కడే బస చేసేవారు. జూట్‌మిల్లు మూతపడటంతో ఈ బంగ్లా కూడా గత 15 ఏళ్లుగా మూతబడి ఉంది. అయినప్పటికీ ప్రత్యేకమైన నిర్మాణ శైలి కారణంగా చాలా మంది దానిని చూసి ఆనందించేవారు. కొన్నేళ్ల క్రితం ప్రైవేటు వ్యక్తులు దీనిని కొనుగోలు చేయగా, ప్రస్తుతం వారు దానిని కూల్చివేశారు. ఇప్పటికే ఎన్నో అరుదైన చారిత్రక కట్టడాలు కనుమరుగవగా, ఇప్పుడు ఈ 'ఓషన్ వ్యూ బంగ్లా' కూడా చరిత్రలో కలిసిపోయింది.

స్నేహితుడి ఇంట్లో చోరీ.. నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న హార్బర్ క్రైమ్ ఏసీపీ లక్ష్మణరావు

పెదగంట్యాడ: మండలంలోని దయాల్‌నగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో చొరబడి చోరీ చేసిన నిందితుడు కాంబలి దిలీప్‌ను న్యూపోర్టు పోలీసులు అరెస్టు చేశారు. ఈ విషయాన్ని హార్బర్ క్రైమ్ ఏసీపీ లక్ష్మణరావు గురువారం న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. దయాల్‌నగర్‌కు చెందిన బేర రాజు ఈ నెల 4న తన కుటుంబంతో కలిసి స్వగ్రామమైన పాడేరు మండలం సలుగు వెళ్లారు. రాజు కుటుంబం ఊరిలో లేని విషయాన్ని అతని స్నేహితుడైన కంచరపాలెం బర్మా క్యాంప్‌కు చెందిన దిలీప్ తెలుసుకున్నాడు. ఈ నెల 5న అర్ధరాత్రి సమయంలో రాజు ఇంటికి చొరబడి, బీరువాలో ఉంచిన బంగారు పుస్తెలతాడు, రెండు చెయిన్లు, ఒక గొలుసు, ఒక బ్రేస్‌లెట్, ఒక చిన్న ఉంగరం, ఒక లాకెట్‌తో పాటు రూ. 20 వేల నగదును దొంగిలించాడు. ఈ నెల 6న తిరిగి వచ్చిన రాజు ఇంట్లో వస్తువులు చిందరవందరగా ఉండటం, బీరువా తెరిచి ఉండటం చూసి చోరీ జరిగినట్లు గుర్తించి న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. క్రైం డీసీపీ పర్యవేక్షణలో క్రైం సీఐ జి. శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేపట్టారు. గురువారం నిందితుడిని కంచరపాలెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంతంలోని సర్వీస్ రోడ్డులో అదుపులోకి తీసుకున్నారు. ఏసీపీ లక్ష్మణరావు మాట్లాడుతూ, నిందితుడు చిన్నప్పటి నుంచి చెడు వ్యసనాలకు బానిసయ్యాడని, జల్సాలకు అలవాటు పడ్డాడని తెలిపారు. నిందితుడిపై గతంలో అనకాపల్లి జిల్లా చీడికాడ, అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా పాడేరు పోలీస్ స్టేషన్లలో కూడా చోరీ కేసులు ఉన్నాయని వివరించారు. నిందితుడి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ అప్పలరాజు చెప్పారు.

ఉత్సాహంగా క్రికెట్ శిక్షణ శిబిరం





చిన్నారులకు బ్యాటింగ్, బౌలింగ్‌లో మెలకువలు నేర్పుతున్న శిక్షకులు

విశాఖ స్పోర్ట్స్: వేసవి క్రికెట్ శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. నెలరోజుల పాటు వీడీసీఏ ఆధ్వర్యంలో ఈ శిబిరాలు నగరంలోని నాలుగు వేదికల్లో కొనసాగుతుండగా బ్యాటింగ్, బౌలింగ్‌తో పాటు ఫీల్డింగ్‌లోనూ శిక్షణ నడుస్తుంది. ఈ శిబిరాల్లో శిక్షణకు గాను అండర్ 10, 12, 14లతో పాటు అండర్ 16ల్లోనూ ఎంపిక చేశారు. శిక్షణార్థుల అభిరుచిని బట్టి ఆయా అంశాల్లో శిక్షణ ఇచ్చి చివరి వారంలో జట్లుగా పోటీల్ని నిర్వహించనున్నారు. సత్తాచాటిన వారిని జిల్లా జట్ల ఎంపికలోనూ పరిగణించనున్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో విస్తృత తనిఖీలు



తనిఖీలు చేస్తున్న పోలీసులు

అల్లిపురం: పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు ఆర్టీసీ కాంప్లెక్స్, చావులమదుం, గొల్లలపాలెం ప్రాంతాల్లో టూటౌన్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ సతీష్ సిబ్బందితో కలిసి ఆర్టీసీ కాంప్లెక్స్, బస్సుల్లో ప్రయాణికుల బ్యాగులు, సూట్‌కేసులు తనిఖీ చేశారు. గంజాయి, అనుమానాస్పద వెపన్స్, మాదక ద్రవ్యాలు రవాణా చేస్తున్నారేమో అని తనిఖీలు చేపట్టారు. అదే విధంగా టూటౌన్ ఎస్ఐలు సింహాచలం, మన్మథరావు తమ సిబ్బందితో కలిసి గొల్లలపాలెం, చావులమదుం జంక్షన్లలో వాహనాలు తనిఖీ చేశారు.

వైభవ వేంకటేశ్వరుడి కల్యాణ వైభోగం



వేదికపై కొలువైన కల్యాణ వైభవుడు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి 23వ వార్షిక కల్యాణోత్సవం గురువారం వైభవంగా జరిగింది. సాయంత్రం 5 గంటలకు స్వామి ఎదురు సన్నాహ ఉత్సవం నిర్వహించారు. అనంతరం ఉత్తర ద్వారం సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వైదికపై వైభవుడిని కల్యాణమూర్తిగా ఆశీనులు గావించారు. భూదేవీ, శ్రీదేవీ సమేత వైభవుడి కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పెళ్లి పెద్దలుగా 32 మంది దంపతులు వేదికపై ఆశీనులు కాగా.. ఆలయ అర్చకులు వాసుదేవాచార్యులు, శేషాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వైభవ్ సిస్టర్స్ మాధురి, శిరీష అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు వైభవుడికి లక్షమల్లెలతో అర్చన నిర్వహిస్తామని నిర్వాహకులు చెప్పారు.

రైల్వే స్టేషన్‌లో తనిఖీలు



రైల్వే స్టేషన్‌లో లగేజీ తనిఖీ చేస్తున్న పోలీస్ అధికారులు

సీతంపేట: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి, సీఐ సత్యనారాయణ పర్యవేక్షణలో సిబ్బంది గురువారం రాత్రి విశాఖ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. అనుమానిత ప్రయాణికుల బ్యాగులు, లగేజీలను పరిశీలించారు. గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా చేస్తున్న వారిని గుర్తించడానికి తనిఖీలు చేపట్టినట్లు పోలీస్ అధికారులు తెలిపారు.

గ్రంథాలయ సంస్థ సెస్సు బకాయిలు మంజూరు చేయాలి

మహారాణిపేట: గ్రంథాలయ సంస్థ సెస్సు బకాయిలు మంజూరు చేయాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గొనుగుంట్ల కోటేశ్వరరావు కోరారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పలు విషయాలపై చర్చించారు. జిల్లా గ్రంథాలయ సంస్థకు జీవీఎంసీ నుంచి రూ. 148 కోట్ల సెస్సు బకాయిలు రావాల్సి ఉందని, వాటిని వీలైనంత త్వరగా ఇప్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన కలెక్టర్ బకాయిలను విడతల వారీగా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో స్టేట్ స్పోర్ట్స్ చైర్మన్ ఎ.రవి నాయుడు, ఎమ్మెల్యే గణబాబు పాల్గొన్నారు.